# భారతదేశ చరిత్ర

## భారత జాతీయోద్యమం

ఆంగ్ల సామ్రాజ్య విస్తరణ విధానాలు, వారు సాధించిన రాజకీయ ఐక్యత, ఆంగ్ల పాలన, ఆంగ్ల విద్య, ఆధునిక రవాణా సౌకర్యాల కల్పన, ఆంగ్లేయులు అనుసరించిన జాతి, వర్ణ వివక్షా విధానాలు, ఆర్థిక దోపిడీ విధానాలతోపాటు సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాలు, వార్తాపత్రికలు, సాహిత్య రచనలు, ఇల్బర్ట్ బిల్లు వివాదం లాంటి సంఘటనలు భారతీయుల్లో జాతీయోద్యమ భావాలను పెంపొందించాయి. సుగంధ ద్రవ్యాల వ్యాపారం నిమిత్తం భారతదేశానికి వచ్చిన ఆంగ్లేయులు, క్రమంగా దేశాన్ని ఆక్రమించడానికి అనేక సామ్రాజ్యవాద విధానాలను అనుసరించారు. తమ తమ రాజ్యాలను కోల్పోయిన భారతీయ పాలకులు, ఆయా రాజ్యాల్లో ఉపాధి పోగొట్టుకున్న ఉద్యోగులు ఆంగ్లేయుల పట్ల ద్వేష భావాన్ని పెంచుకున్నారు. అనేక భూభాగాలు, రాజ్యాలుగా విడిపోయి ఉన్న భారత దేశాన్ని ఆంగ్లేయులు ఒకే పాలన కిందికి తెచ్చి, ఐక్యతా భావాన్ని పెంచడానికి తోడ్పడ్డారు. ఆంగ్లేయులు కల్పించిన ఆధునిక రవాణా సౌకర్యాలు కూడా దేశంలోని ప్రజల మధ్య పరస్పర అవగాహనకు ఉపకరించాయి.

1835లో విలియం బెంటింక్ ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్య భారతీయుల్లో జాతీయ చైతన్యం మరింత పెరగడానికి దోహదం చేసింది. ఆంగ్ల విద్యను అభ్యసించిన భారతీయులు మిగిలిన భారతీయులకు స్వేచ్ఛ, సమానత్వం లాంటి అంశాలను తెలియజేశారు.

19వ శతాబ్దంలో భారతదేశంలో వచ్చిన సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాలు భారతీయుల్లో దేశభక్తిని, జాతీయవాద స్ఫూర్తిని పెంచాయి. భారతదేశం భారతీయులకే అని స్వామి దయానంద సరస్వతి పేర్కొన్నారు. స్వామి వివేకానందుడు ఆధునిక జాతీయతకు పితామహుడిగా పేరుగాంచారు. వార్తాపత్రికలు ఆంగ్లేయుల జాతి వివక్ష విధానాలను, ఆర్థిక దోపిడీ విధానాలను ఎప్పటికప్పుడు ప్రచారం చేసి, జాతీయ చైతన్యాన్ని పెంచాయి. ముఖ్యంగా లార్డ్ రిప్పన్ కాలంలో ప్రవేశపెట్టిన ఇల్బర్ట్ బిల్లుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులు చేసిన ఉద్యమం భారతీయుల్లో జాతీయ భావాలను మరింత పెంచి, 1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు దారితీసింది. భారత జాతీయ కాంగ్రెస్ చరిత్రనే జాతీయ స్వాతంత్రోద్యమ చరిత్రగా పేర్కొంటారు.

### తొలి రాజకీయ సంస్థలు

ఆధునిక భారతదేశ చరిత్రలో రాజకీయ సంస్థల ఏర్పాటుకు కారకులు కూడా ఆంగ్లేయులే. బెంగాల్ రాష్ట్రంలో 1828లో హెన్రీ డిరోజియో నాయకత్వంలో అకడమిక్ అసోసియేషన్ అనే సంస్థ ఏర్పడింది. డిరోజియోను చరిత్రకారులు బెంగాల్ సోక్రటీస్‌గా అభివర్ణిస్తారు. తర్వాత 1838లో థియోడర్ డికెన్స్ నాయకత్వంలో బెంగాల్ భూస్వాముల సంఘం ఏర్పాటైంది. భారతదేశ చరిత్రలో తొలి రాజకీయ సంస్థగా దీన్నే పేర్కొంటారు. అనంతరం 1843లో బెంగాల్ బ్రిటిష్ ఇండియా సంఘాన్ని స్థాపించారు. 1851లో బెంగాల్ భూస్వాముల సంఘం, బెంగాల్ బ్రిటిష్ ఇండియా సంఘం కలిసి బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్‌గా ఏర్పడ్డాయి. దీని తొలి అధ్యక్షుడిగా రాధాకాంత్‌దేవ్, కార్యదర్శిగా దేవేంద్రనాథ్ ఠాగూర్ పని చేశారు. 1852 లో దాదాభాయ్ నౌరోజీ, పర్దూన్‌జీ జగన్నాథ్ లాంటి వారు బాంబే అసోసియేషన్‌ను స్థాపించారు. 1853లో గాజుల లక్ష్మీనరసు సెట్టి మద్రాస్ నేటివ్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు.

దాదాభాయ్ నౌరోజీ 1865లో లండన్ కేంద్రంగా లండన్ ఇండియన్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. ఇదే తర్వాతి కాలంలో ఈస్ట్ ఇండియా అసోసియేషన్‌గా మారింది. 1870లో జి.వి. జోషి, చిప్లుంకర్ పూనా సార్వజనిక సభను స్థాపించారు. దీని తొలి సమావేశం 1871లో ఎం.జి. రనడే అధ్యక్షతన జరిగింది. (పూనా సార్వజనిక సభ స్థాపకుడిగా ఈయన్ను పేర్కొంటారు). 1875లో శిశిర్ కుమార్ ఘోష్ నాయకత్వంలో ఇండియన్ లీగ్ (బెంగాల్) ఏర్పడింది. 1876 జులై 26న సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనంద్ మోహన్ బోస్‌తో కలసి ఇండియన్ అసోసియేషన్‌ను స్థాపించారు. సుబ్రహ్మణ్య అయ్యర్, వీరరాఘవాచారి, పి. ఆనందాచార్యులు, రంగయ్యనాయుడు లాంటి వారి కృషి వల్ల 1884లో మద్రాస్ మహాజనసభ ఏర్పడింది. 1885లో ఫిరోజ్‌షా మెహతా, బద్రుద్దీన్ త్యాబ్జీ, కె.టి. తెలాంగ్ లాంటి వారు బొంబాయి ప్రెసిడెన్సీ అసోసియేషన్‌ను స్థాపించారు. అయితే ఈ తొలి తరం రాజకీయ సంస్థలన్నీ ఆయా ప్రాంతాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహించాయి.

భారతదేశంలో జాతీయోద్యమ భావాలు, ఆందోళనలు రాజా రామ్మోహన్‌రాయ్‌తో ప్రారంభమయ్యాయని ఆధునిక చరిత్రకారులు పేర్కొంటారు. స్వామి వివేకానంద బోధనలు యువకుల్లో దేశభక్తిని పెంపొందించాయి. సురేంద్రనాథ్ బెనర్జీ తొలిసారిగా ఒక అఖిల భారత రాజకీయ సంస్థను స్థాపించడానికి కృషి చేశారు. ఇల్బర్ట్ బిల్లు భారతీయులకు నేర్పిన గుణపాఠాన్ని విద్యావంతులైన భారతీయులెవరూ మరచిపోరని థాంప్సన్, గారట్ లాంటి చరిత్రకారులు పేర్కొన్నారు. 1867లోనే డబ్ల్యూసీ బెనర్జీ తన ఇంగ్లండ్ ఉపన్యాసంలో ప్రాతినిధ్య ప్రభుత్వ ఆవశ్యకత గురించి ప్రస్తావించారు. క్రిస్టోదాస్ పాల్ తన హిందూ పేట్రియాట్ పత్రికలో రాసిన

వ్యాసంలో "ఆంగ్లేయులు ఆఫ్రికా, ఆసియా వలసల్లో రాజ్యాంగబద్ధ స్వపరిపాలన ప్రవేశపెట్టి, భారతదేశంలో ఎందుకు ప్రవేశపెట్టలేదు' ' అని ప్రశ్నించారు. లిట్టన్ ప్రవేశపెట్టిన ప్రాంతీయ భాషా పత్రికల చట్టానికి వ్యతిరేకంగా భారతీయులు పంపిన తీర్మానాన్ని గ్లాడ్‌స్టన్ (నాటి ఇంగ్లండ్ పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత) కామన్స్ సభలో ప్రవేశపెట్టాడు. భారతీయులకు సివిల్ సర్వీస్ పరీక్షల అర్హత వయసును తగ్గించడంపై లాల్ మోహన్ ఘోష్ కామన్స్ సభలో మాట్లాడాడు. ఇల్బర్ట్ బిల్లు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న నాటి కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేసినందుకు సురేంద్రనాథ్ బెనర్జీకి జైలుశిక్ష విధించారు. ఈ విధంగా తొలితరం నాయకులు జాతీయోద్యమ భావాలను ప్రచారం చేయడం ద్వారా భారతీయుల్లో జాతీయోద్యమ స్ఫూర్తిని పెంపొందింపజేశారు. 1883లో ఇండియన్ నేషనల్ కాన్ఫరెన్స్ తొలి మహాసభను కలకత్తాలో నిర్వహించారు.

## భారత జాతీయ కాంగ్రెస్

1885 డిసెంబరు 28న ఎ.ఒ.హ్యూమ్ అనే ఆంగ్లేయుడి నాయకత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటైంది. దీని తొలి సమావేశం బొంబాయిలోని గోకుల్‌దాస్ తేజ్‌పాల్ సంస్కృత కళాశాలలో డబ్ల్యూసీ బెనర్జీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా మొత్తం 72 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వాస్తవానికి భారత జాతీయ కాంగ్రెస్ తొలి సమావేశం పూనాలో జరపాలని భావించారు. కానీ అక్కడ ప్లేగు వ్యాధి వ్యాపించడంతో బొంబాయిలో నిర్వహించారు. ఎ.ఒ.హ్యూమ్ భారతీయులపై ఉన్న ప్రేమతో, భారతీయులకు మేలు చేసే ఉద్దేశంతో కాంగ్రెస్‌ను స్థాపించలేదు. విద్యావంతులైన భారతీయులతోనే భారతదేశంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వచ్చే ఉద్యమాన్ని నీరుగార్చాలనే రక్షణ కవాట సిద్ధాంతాన్ని హ్యూమ్ అనుసరించాడు. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన నాటి వైస్రాయ్ లార్డ్ డఫ్రిన్ హ్యూమ్ చర్యను కొనియాడాడు. కానీ తర్వాతి కాలంలో కాంగ్రెస్‌ను అల్ప సంఖ్యాక వర్గాలవారి సంస్థ (మైక్రోస్కోపిక్ మైనారిటీ ఇన్‌స్టిట్యూషన్) అంటూ విమర్శించాడు. భారతదేశంపై రష్యా దండెత్తి వస్తుందనే భయంతోనే హ్యూమ్ కాంగ్రెస్‌ను స్థాపించాడని చటర్జీ లాంటి పండితులు పేర్కొన్నారు. 'భారతీయుల ఆలోచనా విధానంపై పాశ్చాత్య నాగరికత ప్రభావ ఫలితమే భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం' అని విలియం వెడ్డర్ బర్న్ పేర్కొన్నారు.

1886లో ఐఎన్‌సీ రెండో సమావేశం కలకత్తాలో దాదాభాయ్ నౌరోజీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సుమారు 436 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 1887లో మద్రాస్‌లో బద్రుద్దీన్ త్యాబ్జీ అధ్యక్షతన జరిగిన మూడో సమావేశానికి సుమారు 607 మంది ప్రతినిధులు హాజరయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి ముస్లిం వ్యక్తి బద్రుద్దీన్ త్యాబ్జీ. నాలుగో సమావేశం 1888లో జార్జియూలె అధ్యక్షతన అలహాబాద్‌లో జరిగింది. భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి విదేశీయుడు జార్జియూలె. 5వ సమావేశం 1889లో విలియం వెడ్డర్ బర్న్ అధ్యక్షతన బొంబాయిలో జరిగింది. ప్రముఖ ఆంగ్లేయ ప్రతినిధి చార్లెస్‌బ్రాడ్‌లా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇతడిని ఇంగ్లండ్‌లో 'భారత ప్రతినిధి' సభ్యుడిగా పేర్కొంటారు. కాంగ్రెస్ కోరికలను నెరవేర్చడమంటే భారతదేశానికి స్వపరిపాలన ఇచ్చినట్లేనని టైమ్స్ ఆఫ్ లండన్ పత్రిక వ్యాఖ్యానించింది. విలియం వెడ్డర్న్ బర్న్ అధ్యక్షతన ఇంగ్లండ్‌లో ఏర్పడిన 'బ్రిటిష్ కమిటీ'కి విలియం డిగ్బీని కార్యదర్శిగా నియమించారు. దాదాభాయ్ నౌరోజీని ఇంగ్లండ్‌లో భారత జాతీయ కాంగ్రెస్ ప్రచారకర్తగా నియమించారు. ఈ విధంగా భారత జాతీయ కాంగ్రెస్ స్వదేశంలో, ఇంగ్లండ్‌లో భారత జాతీయోద్యమ అభివృద్ధికి కృషి చేసింది. నౌరోజీ ఉద్యమ ప్రచారానికి 'ఇండియా' అనే పత్రికను ప్రారంభించారు. కానీ తర్వాతి కాలంలో ఆంగ్లేయులు కాంగ్రెస్‌ను కుట్రదారుల ముఠాగా వ్యాఖ్యానించారు. ముఖ్యంగా లార్డ్ కర్జన్ 'కాంగ్రెస్ అంతాన్ని చూడటమే నా ప్రధాన ఆశయం' అని పేర్కొన్నాడు.

భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి ఆంధ్రుడు పి.ఆనందాచార్యులు. 1891 నాగ్‌పూర్ కాంగ్రెస్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఐఎన్‌సీకి అధ్యక్షత వహించిన తొలి మహిళ అనిబిసెంట్. ఈమె 1917 కలకత్తా కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించారు. భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి భారతీయ మహిళగా సరోజినీ నాయుడు పేరు పొందారు. 1925 కాన్పూర్ కాంగ్రెస్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. గాంధీజీ తన జీవితకాలంలో ఒకే ఒకసారి కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించారు. 1924 నాటి బెల్గాం సమావేశం గాంధీ అధ్యక్షతన జరిగింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి జె.బి.కృపలానీ.

## నమూనా ప్రశ్నలు

**1.** బెంగాల్ సోక్రటీస్‌గా పేరు పొందిన వ్యక్తి?

1) రాజా రామ్మోహన్‌రాయ్ 2) డబ్ల్యూసీ బెనర్జీ

3) సురేంద్రనాథ్ బెనర్జీ 4) హెన్రీ డిరోజియో

**2.** భారతదేశంలో తొలి రాజకీయ సంస్థగా పేరు పొందింది?

1) అకడమిక్ అసోసియేషన్ (1828)

2) బెంగాల్ భూస్వాముల సంఘం (1838)

3) బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్ (1851)

4) ఇండియన్ అసోసియేషన్ (1876)

**3.** ఇండియన్ అసోసియేషన్ స్థాపనలో సురేంద్రనాథ్ బెనర్జీకి సహాయ చేసినవారు?

1) డబ్ల్యూసీ బెనర్జీ 2) దాదాభాయ్ నౌరోజీ

3) ఆనంద్ మోహన్ బోస్ 4) విలియం డిగ్బీ

**4.** 'ఆధునిక జాతీయతాభావ పితామహుడు'గా పేరు పొందింది?

1) స్వామి వివేకానంద 2) గాంధీజీ 3) స్వామి దయానంద 4) భగత్‌సింగ్

**5.** 1883లో కలకత్తాలో ఇండియన్ నేషనల్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసింది?

1) ఎ.ఒ. హ్యూమ్ 2) సురేంద్రనాథ్ బెనర్జీ

3) డబ్ల్యూసీ బెనర్జీ 4) విలియం వెడ్డర్ బర్న్

**6.** భారత జాతీయ కాంగ్రెస్‌ను 'అల్ప సంఖ్యాక వర్గాల సంస్థ' అని వ్యాఖ్యానించినవారు?

1) కర్జన్ 2) డఫ్రిన్ 3) లిట్టన్ 4) జార్జియూలె

**7.** భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి మహిళ?

1) సరోజినీ నాయుడు 2) అనిబిసెంట్

3) కాదంబరి గంగూలీ 4) ఎవరూకాదు

**జవాబులు:** 1-4; 2-2; 3-3; 4-1; 5-2; 6-2; 7-2.

**రచయిత: బొత్స నాగరాజు**

www.eenadupratibha.net